క్లుప్తంగా

ముగిసిన సప్తాహ



కలశాలతో ప్రదర్శన చేస్తున్న మహిళలు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో వారం రోజులుగా కొనసాగిన అఖండ హరినామా సప్తాహ కార్యక్రమం శనివారంతో ముగిసింది. పలువురు ఆధ్యాత్మిక వేత్తలు ప్రవచనాలు బోధించారు. అనంతరం మహిళలు తలపై నిండు కలశాలతో గ్రామంలో ప్రదర్శనగా వెళ్లి గ్రామదేవతకు సమర్పించారు. శని అమావాస్య కావడంతో ఖేడ్ మండలం కొండాపూర్‌లోని హనుమాన్ ఆలయం, దోపూరులొంక హనుమాన్ ఆలయాలతో పాటు ఖేడ్ పట్టణంలోని హనుమాన్ ఆలయాలను భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించారు.

పొగాకు వాడకంతో నష్టం



అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్: పొగాకు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఖేడ్ మండలం పంచనామ శనీశ్వరాలయ పరిసరాల్లో భక్తులకు పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్, గుట్కా, పాన్‌మసాలా లాంటివి సేవిస్తే అనారోగ్యాల బారిన పడతామన్నారు. పొగాకు ఉత్పత్తుకు దూరంగా ఉండాలని సూచించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం, (పటాన్‌చెరు): రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎం.బుచ్చిరెడ్డి అన్నారు. శనివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరానికి ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. విజయవంట నూనెలు సొసైటీ ద్వారా తక్కువ ధరలకు అందిస్తున్నామని సభ్యులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు రాజ్‌కుమార్, మోహన్‌రెడ్డి, సునీల్, లక్ష్మన్, వ్యవసాయ విస్తీర్ణ అధికారిణి రాణి పాల్గొన్నారు.

స్కూటి దగ్ధం

కల్హేర్(నారాయణఖేడ్): ఎండ వేడితో స్కూటి దగ్ధమైంది. శనివారం సిర్గాపూర్ మండలం పోచాపూర్ శివారులో సంఘటన చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. గోసాయిపల్లికి చెందిన బస్వరాజ్ స్వామి స్కూటిపై పోచాపూర్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఆకస్మికంగా పొగలు వచ్చాయి. అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మంటలతో స్కూటి దగ్ధమైంది.

పదవీ విరమణ సహజం

అదనపు ఎస్పీ సంజీవరావు



అధికారులను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ

సంగారెడ్డి జోన్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమేనని జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు అన్నారు. పదవి విరమణ పొందిన వివిధ స్థాయి ఉద్యోగులకు శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. గొల్ల రాములు, సబ్–ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఖుర్షీద్ అలీ సబ్–ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సంజీవయ్య, ఎఆర్.ఎస్‌ఐలు పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖకు అందించిన సేవలు మరువలేనివని వారి సేవలను కొనియాడారు. విరమణ అనంతరం పోలీసు శాఖ నుంచి రావలసిన అన్నిరకాల బెనిఫిట్స్ సకాలంలో అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ. కళ్యాణి, ఎఆర్. డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆర్.ఐ. రామరావు, అధికారుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షడ్రుచుల శోభితం.. ఉగాదికి స్వాగతం

శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది ముందస్తు వేడుకలను శనివారం జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాలకు వచ్చారు. పాఠశాలను మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి షడ్రుచులతో ఉగాది పచ్చడిని తయారు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఉగాది తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ఉపాధ్యాయులు ఉగాది విష్టతను విద్యార్థులకు వివరించారు.



ఉగాది సంబరాలలో పాల్గొన్న యువతులు



–బి.శివప్రసాద్, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



జిన్నారం (పటాన్‌చెరు): ఉగాది వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు



పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహిస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ



సదాశివపేట రూరల్ : నిజాంపూర్ (కే) ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో ..

పాడి రైతుల సంక్షేమం కోసం కృషి

రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ అమిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అమిత్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్‌లోని పాలశీతలీకరణ కేంద్రంలో శనివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గేదె పాలకు రూ.2 అదనంగా పెంచేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని సూచించారు. రాబోయే రోజుల్లో మిల్క్ పార్లర్‌లను బలోపేతం చేసి మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ మెరుగు పరుస్తామని చెప్పారు. పశువులకు ఇన్సూరెన్స్ పాలసీని చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ డేవిడ్, నాయకులు రమేష్ చౌహాన్, భోజిరెడ్డి, జీవన్, పశువైద్యాధికారి నేతాజి పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: శరవేగంగా విస్తరిస్తున్న డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పరిధిలోని పంచముఖి హనుమాన్ దేవాలయం నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన విధి దీపాలను ప్రారంభించారు. అనంతరం రూ.30 లక్షల రూపాయలతో సింఫనీ కాలనీ నుంచి చిన్న వాగు వరకు చేపట్టనున్న పూడికతీత పనులను ప్రారంభించారు.

అంతా శుభం జరగాలి

విశ్వావసు నామ సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరికీ శుభం జరగాలని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆకాంక్షించారు. నూతన సంవత్సరం ఉగాది పర్వదినం పురస్కరించుకొని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలని కోరారు.

జోగినాథ 'గిరి ప్రదర్శన'కు ఆదరణ



గిరిప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు

జోగిపేట(అందోల్): జోగిపేటలోని శ్రీ జోగినాథ దేవాలయం వద్ద నిర్వహిస్తున్న గిరి ప్రదర్శనకు ఆదరణ పెరుగుతుంది. ఇటీవల ఆలయం చుట్టూ చేపడుతున్న గిరి ప్రదర్శనకు శనివారం అమావాస్య కావడంతో వందల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహిళలు, భక్తులు సంప్రదాయ దుస్తులతో ఆలయం చుట్టూ తిరుగుతూ ఓం నమఃశివాయ నామస్మరణతో ముందుకు కదిలారు. ఆలయంలోని జోడు లింగాలకు పాలు, నీళ్లతో అభిషేకం చేశారు. అనంతరం గిరి ప్రదర్శనను నిర్వహించి పూజలు నిర్వహించారు. శని అమావాస్య కావడంతో భక్తులు నేరుగా హనుమాన్ దేవాలయానికి వెళ్లి పూజలు చేశారు.

కృత్రిమ ఇసుక వేలం

కంది(సంగారెడ్డి): కంది తహసీల్దార్ కార్యాలయంలో ఇసుకను బహిరంగ వేలం వేశారు. మండలంలోని ఆరుట్ల, బేగంపేట్, భాతోల్ గ్రామాల శివార్లలో అక్రమంగా తయారు చేస్తున్న కృత్రిమ ఇసుకను స్వాధీనం చేసుకొని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిల్వ ఉంచారు. శనివారం తహసీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇసుకను వేలం వేశారు. ఈ వేలంలో జహీరాబాద్ చెందిన లక్కీయుద్దీన్ రూ5.80 లక్షలకు ఇసుకను దక్కించుకున్నాడు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక అస్పృశ్యత విడనాడాలి



సివిల్ రైట్స్ డేలో పాల్గొన్న అధికారులు, స్థానికులు

కంగ్టి(నారాయణఖేడ్): సామాజిక అస్పృశ్యత పాటించడం నేరమని.. అందరు కలిసి మెలిసి ఉండాలని సివిల్ రైట్స్ దినోత్సవం పురస్కరించుకొని అధికారులు పిలుపునిచ్చారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు శనివారం మండలంలోని భీంరా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సివిల్ రైట్స్ దినోత్సవం నిర్వహించారు. కులాలు, మతాల పేర దూషణలు తగవని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తాజోద్దిన్, జూనియర్ అసిస్టెంట్ రావుఫ్, పంచాయతీ సెక్రటరీ సంజీవ్, భీంరా గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

డిపో మేనేజర్ ఉపేందర్

సంగారెడ్డి టౌన్: ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తామని సంగారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్ అన్నారు. శనివారం సంగారెడ్డి డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 మంది ప్రయాణికులు సలహాలు, సూచనలను తెలియజేశారు. జోగిపేట నుంచి ప్రసాద్ మాట్లాడుతూ.. జోగిపేట, లింగంపల్లి బస్సుల్లో కొన్ని బస్సులను ఎంఎస్‌ఆర్ నుంచి నడపాలని, జులకల్ నుంచి వీరయ్య మాట్లాడుతూ.. శంకర్‌పల్లి రోడ్లలో అదనపు బస్సులను నడపాలని, వట్టిపల్లి నుంచి దిగంబరావు మాట్లాడుతూ.. సంగారెడ్డి వట్‌పల్లి మీదుగా బోరంచమ్మ వారి గుడికి బస్సులను రాత్రి వేళలో నడపాలన్నారు. ఖేడ్ నుంచి శివకుమార్ మాట్లాడుతూ.. సాయంత్రం వేళలో సంగారెడ్డి నుంచి అదనపు బస్సులను నడపాలని కోరారు. త్వరలో నే ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



విందులో పాల్గొన్న గిరిధర్‌రెడ్డి, ఆర్డీఓ, చంద్రశేఖర్

సంగారెడ్డి: అన్ని మతాల వారు అన్నదమ్ములా కలిసి, మెలసి ఉండాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని మిలాద్ మైదానంలో శనివారం జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ నిలుస్తోందని అన్నారు.

ఇఫ్తార్ విందుతో ఐక్యత

జహీరాబాద్: ప్రభుత్వం తరఫున ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శనివారం పట్టణంలోని ఏషియన్ ఫంక్షన్‌హాల్‌లో రెవెన్యూ అధికారులు విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, ఆర్డీఓ రాంరెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, తహసీల్దార్ రవీందర్, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్, పాల్గొన్నారు.

తడ్కల్‌లో..

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండలంలోని తడ్కల్ గ్రామంలోని మసీదులో శనివారం స్థానిక మైనార్టీ అధ్యక్షుడు డాక్టర్ హమీద్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు.

జోగిపేటలో దొంగల బీభత్సం

నాలుగు ద్విచక్రవాహనాల ధ్వంసం.. పెట్రోల్ చోరీ



ధ్వంసమైన స్కూటీ

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని శ్రీజోగినాథ కాలనీ ఎన్టీఆర్ స్టేడియం ఎదుట నివసించే బక్కమొల్ల రవీందర్‌రెడ్డి ఇంట్లో అద్దెకు ఉండే వారి నాలుగు ద్విచక్రవాహనాలను శుక్రవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. ఘటనకు సంబంధించి రవీందర్ రెడ్డి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగలు రవీందర్‌రెడ్డి, గడ్డమోల్ల గోపాల్‌కు చెందిన స్కూటీని ధ్వంసం చేశారు. ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, రుమాండ్ల రమేశ్‌ల వాహనాలను ధ్వంసం చేసి అందులోని పెట్రోల్‌ను దొంగిలించారు. అదేకాలనీలో నివసించే కలాలి శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన సెల్ ఫోన్‌ను దోమల తెరను కత్తిరించి కిటికిలో నుంచి దొంగిలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కేతకీలో అమావాస్య పూజలు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయానికి భక్తులు పొటెత్తారు. శనివారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి, జలలింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులను దర్శించుకునేందుకు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. క్యూలైన్లలో భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. స్వామి వారికి అభిషేకం, అర్చన, హారతిపూజ వాహనపూజ నిర్వహించారు.

పోటెత్తిన భక్తులు

నారాయణఖేడ్: శని అమావాస్యను పురస్కరించుకుని ఖేడ్ మండలం పంచగామలోని శనీశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తుల రాకతో ఖేడ్ –పంచగామ రహదారి వాహనాలతో కిటకిటలాడింది. హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి శనీశ్వరుడికి దర్శించుకుని తైలంతో అభిషేకం చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

జహీరాబాద్ టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుడికి చెక్కు మంజూరయింది. మండలంలోని కొత్తూర్(బి) గ్రామానికి చెందిన ప్రదీప్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్సపొందూ ఆర్థిక సహాయం కోసం సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిని కోరారు. దీంతో చెక్కును మంజూరు చేయించి శనివారం అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతి బాధ్యులపై చర్యలు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కల్హేర్(నారాయణఖేడ్): నల్లవాగు గురుకుల పాఠశాలలో విద్యార్థి నిఖిల్ మృతిపై నిర్లక్ష్యం వహించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. శనివారం సిర్గాపూర్ మండలం నల్లవాగు గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థి నిఖిల్ మృతిపై విచారణ చేశారు. పాఠశాలలో నిఖిల్ ఆరోగ్యం గురించి ప్రిన్సిపాల్ తిరుపతయ్య, విద్యార్థులతో వేర్వేరుగా మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు నెల వైద్య పరీక్షలు చేయకుండా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌ఓ గాయత్రిదేవితో ఫోన్‌లో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కావొద్దని ఆదేశించారు. విద్యార్థి నిఖిల్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బోజిరెడ్డి, నాయకులు రమేష్ చౌహాన్, యాదవరెడ్డి, దేవదాస్, జయరాజ్, శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

బాధ్యులను సస్పెండ్ చేయండి

నారాయణఖేడ్: నల్లవాగు గురుకులం నిర్లక్ష్యం వల్లనే 9వ తరగతి విద్యార్థి నిఖిల్ మృతి చెందాడని.. ఇందుకు బాధ్యులైన ప్రిన్సిపాల్, వార్డెన్, హెల్త్ అసిస్టెంట్లను సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ అశోక్, జిల్లా నాయకులు ప్రవీణ్, లింగం, గణేష్, నరేష్, ఏబీవీపీగర కార్యదర్శి శంకర్‌లు డిమాండ్ చేశారు. శనివారం వారు ఖేడ్‌లో వేర్వేరుగా ఏర్పాటు చేసి సమావేశాల్లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని, ఎంతోమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు.

సంక్షేమ పథకాలతో లబ్ధి

నారాయణఖేడ్: ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్‌లోని ఆయన నివాసంలో శనివారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. మనూరు మండలం బెల్లాపూర్‌కు చెందిన దత్తురెడ్డికి రూ.12వేలు, తుమ్నూర్‌కు చెందిన లలితకు రూ.12వేలు, ఖేడ్‌కు చెందిన మూఢవిఠల్‌కు రూ.30వేలు, గోస్కె శ్రీనివాస్‌కు రూ.12వేలు, పెద్దశంకరంపేటకు చెందిన గంగారాంకు రూ.32వేల చెక్కులను అందజేశారు.

విద్యార్థినికి జాతీయస్థాయి అవార్డు



అవార్డులు అందుకుంటున్న వాసవి

కంగ్టి(నారాయణఖేడ్): ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో తడ్కల్ గ్రామానికి చెందిన పుట్నాల వాసవి జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 24న నుంచి 28 వరకు ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో పోటీలు నిర్వహించారు. జనరల్ నాలెడ్జ్‌లో 2 స్థానం, వ్యాసరచన, వకృత్వపోటీతో పాటు సైబర్‌నేరాలపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో వాసవి 3వ స్థానం పొందింది. కామారెడ్డి జిల్లా పిట్లంలోని బ్లూబెల్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బాలికకు అవార్డు, మెమొంటో అందజేశారు. విద్యార్థి వాసవిని ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

రంజాన్ కానుకల పంపిణీ



వస్తువులను పంపిణీ చేస్తున్న సందీప్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని కొత్లాపూర్ గ్రామంలో శనివారం మైనార్టీలకు 14 రకాల వస్తువులను మాజీ సర్పంచ్ సందీప్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింలకు మంచి జరగాలని తెలియజేస్తూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీ సోదరులు ఆనందంగా పండుగ జరుపుకోవాలని వ్యక్తం చేశారు. అనంతరం మసీదులో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మైనారిటీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.